క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

పరవాడ: ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులకు లయన్స్ డిస్ట్రిక్ట్ 316ఏ లయన్స్ నార్త్ ఆంధ్ర ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ లయన్ ప్రొఫెసర్ ఎస్.వి.ఎస్ దుర్గాప్రసాద్ నగదు బహుమతులు అందజేశారు. కె.తనూజ్‌కుమార్(సెకెండ్ ఇంటర్, స్టీల్‌సిటీ దత్తత స్కూల్)లో అత్యధిక మార్కులు సాధించినందుకు రూ.25 వేలు, కె. నవీన్‌కుమార్(ఫస్ట్ ఇంటర్, మారితు ఈడీఏ స్కూల్)లో అత్యధిక మార్కులు సాధించినందుకు రూ.20 వేలు నగదు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో లయన్ మంత్రి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్నిరంగాల్లో రాణించాలి


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు,విద్యార్థులు

సబ్బవరం: ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకొని ఆదివాసీలు అన్ని రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణరావు అన్నారు. గాలిభీమవరంలోని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ఆదివాసీ సంప్రదాయాలు ఉట్టిపడేలా,వారి హక్కులను తెలియజేసేవిధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సురేంద్రకుమార్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.


14న దేవస్థానం షాపుల లీజ్‌కు బహిరంగ వేలం

సబ్బవరం: మండలంలోని లింగాలతిరుగుడులోని శ్రీసోమలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన షాపుల లీజుకు ఈ నెల 14వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహక అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.దేవస్థానానికి చెందిన 4 షాపులను మూడేళ్ల పాటు లీజుకివ్వడానికి స్వామివారి ఆలయం వద్ద టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించే వేలం పాటలో ఆసక్తి గలవారు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చు. వేలం ఖరారైన వారు వెంటనే 12 నెలల అద్దె సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలని తెలిపారు. హిందూ మతానికి చెందిన వారు మాత్రమే పాటలో పాల్గొవాలని,ఏదైనా గుర్తింపు కార్డుతో వచ్చి డిపాజిట్ చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలతో సమాజంలో గుర్తింపు


ఎమ్మెల్యే పంచకర్లను సత్కరిస్తున్న సంకల్ప సేవా సమితి ప్రతినిధులు

పెందుర్తి: సేవా మార్గంతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. నగర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంకల్ప సేవా సమితి కార్యవర్గ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శకంగా సమాజానికి సేవలందించే ప్రతీ ఒక్కరికీ తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. రానున్న రోజుల్లో సంకల్ప సేవలు మరింత విస్తృతమై పేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కొమ్మన శ్రీనివాసరావు, అందే మహేష్, దాసరి సురేష్ బాబు, ఇమడబత్తిన శివ, నార్నిండి మాధవరావు, ఎస్.వి సత్యనారాయణ, బొత్స సురేష్‌కుమార్, పైడ స్వరూప్, తలాటం వీర రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీపీసీ చిమ్నీల నుంచి మూలస్వయంభూవరంపైకి వస్తున్న కాలుష్యం

ఊరు పొమ్మంటోంది!

సింహాద్రి ఎన్టీపీసీ పరిశ్రమ ఏర్పాటైతే మా జీవితాలు బాగుపడతాయని ఆశించాం.. చివరికి అదే పరిశ్రమ మా జీవనానికే ముప్పు తెచ్చింది. పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యంతో జీవించే పరిస్థితులు కనిపించడం లేదు. గ్రామాన్ని విడిచిపెట్టి పోయే దుస్థితి తెచ్చిందని మండలంలోని కలపాక శివారు మూలస్వయంభూవరం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆశలు అడియాశలు అయ్యాయని వాపోతున్నారు.

- ఎన్టీపీసీ కాలుష్యంతో మూలస్వయంభూవరం ఉక్కిరిబిక్కిరి
- ఎండిపోతున్న పంటలు
- రోగాల బారిన ప్రజలు

పరవాడ: మండలంలోని కలపాక శివారు మూలస్వయంభూవరం గ్రామాన్ని ఆనుకొని 27 ఏళ్ల కిందట ఎన్టీపీసీ పరిశ్రమను ఏర్పాటు చేశారు.అప్పటి నుంచే గ్రామస్తులకు కష్టాలు మొదలయ్యాయి. పరిశ్రమ చిమ్నీల నుంచి విడుదలవుతున్న ఉప్పునీటి తుంపర్లు, వాయు, ధ్వని కాలుష్యంతో గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కాలుష్యంతో పంట పొలాలు, చెట్లు చేమలు పనికిరాకుండా పోయాయి. అనేక మంది గుండె జబ్బులు, చర్మ , శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. దుమ్ము,ధూళితో నివాస గృహాలు పెచ్చులూడిపోయి శ్లాబులు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దిక్కులేని స్థితిలో శ్లాబులు కూలిపోకుండా కర్రలు దన్ను పెట్టి ఇళ్లలో కాలక్షేపం చేస్తున్నారు.


కాలుష్య కాటుకు మాడిపోతున్న కొబ్బరి తోట


చర్మ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి

కాలుష్యం దెబ్బకు కాళ్లు, చేతులకు మచ్చలు ఏర్పడడం, వంకర్లు పోవడం, శ్వాసకోస వ్యాధులు గ్రామస్తులను వేధిస్తున్నాయి. కాలుష్యంతో వ్యవసాయ పంటలన్నీ పూర్తిగా నాశనమయ్యాయి. వరి, కొబ్బరి, సరుగుడు, యూకలిప్టస్, నేరేడు, చింత, తాటి చెట్లు మాడిపోయి ఎందుకు పనికిరాకుండా పోయాయి. పశువుల మేతకు కోసం పెంచుతున్న గడ్డి కూడా మాడిమసైపోతుంది. పశువులకు మేత కరువై బక్క చిక్కిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పరిశ్రమలోని వ్యర్థ జలాలను గ్రామ సమీపంలోని ఉప్పుటేరు నుంచి పంపడం వల్ల భూగర్భ జలాలు కలుషతమై గ్రామంలో తాగునీటి వనరులు పాడైపోయాయి. ఫలితంగా తాగునీటి కోసం దూర ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి దాహం తీర్చుకుంటున్నారు. గ్రామంలో మంచినీటి బోర్లన్నీ ఉప్పునీటి బోర్లుగా మారిపోయాయి. కాలుష్యంతో నరకయాతన పడుతున్న తమ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి ప్రాణాలు రక్షించాలని ఎన్టీపీసీ యాజమాన్యానికి, ప్రజా ప్రతినిధులను కోరినా ఫలితం శూన్యమని గ్రామస్తులు వాపోతున్నారు.

పంటలు నాశనం.. ఆరోగ్యం గుల్ల


తుప్పపట్టి రాలిపోతున్న ఇంటి పైకప్పు కూలిపోకుండా కర్రల సపోర్టు


కాలుష్యం కారణంగా ఎండిపోతున్న వరి ఆకుమడి

భయం భయంగా జీవిస్తున్నాం



మాది నిరుపేద కుటుంబం. కొంత కాలం కిందట అప్పుచేసి ఉండడానికి చిన్న శ్లాబు ఇంటిని నిర్మించుకొన్నాం. ఎన్టీపీసీ పరిశ్రమ నుంచి వస్తున్న ఉప్పునీటి తుంపర్లు ఇళ్లపై పడడంతో శ్లాబు పెచ్చులూడిపోతుంది. శ్లాబు ఏ క్షణంలో కూలిపోతుందోనని కర్రలు దన్ను పెట్టి కాలక్షేపం చేస్తున్నాం. ఇంట్లో ఉండడం భయం భయంగా ఉంది. గ్రామంలో అందరి ఇళ్ల పరిస్థితి ఇదే. అధికారులు, పాలకులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– కప్పరాడ అప్పలనర్సమ్మ, మూలస్వయంభూవరం

వ్యాధులతో సతమతం



మాది వ్యవసాయ కుటుంబం. ఎన్టీపీసీ పరిశ్రమ రాక మునుపు మాకు జబ్బులంటే తెలీవు. కొన్నేళ్ల నుంచి గ్రామం మీదకు చొచ్చుకు వస్తున్న కాలుష్యంతో ప్రమాదకరమైన వ్యాధులు సోకుతున్నాయి. కిడ్నీ, గుండె, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాం. చర్మ వ్యాధులు సోకడంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. మా ప్రాణాలతో ఎన్టీపీసీ యాజమాన్యం ఆటలాడుతుంది. గ్రామాన్ని తరలించాలని కోరినా ప్రయోజనం కనిపించడం లేదు.

– తుమ్మపాల అప్పారావు, మూలస్వయంభూవరం

తాగునీటికి కటకట



ఎన్టీపీసీ కాలుష్యంతో గ్రామంలో తాగునీటి వనరులన్నీ సర్వనాశనమయ్యాయి. బోర్లు కూడా ఉప్పునీటి మయంగా మారిపోయాయి. తాగడానికి నీళ్లు దొరకడం లేదు. శుద్ధి జలాల కోసం పరవాడ తదితర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నాం. కాలుష్యంలో చిక్కుకున్న గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి ఆదుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లాం. సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాం.

– బొండా రాము, మూలస్వయంభూవరం

ధనలక్ష్మిగా కనకదుర్గమ్మ


ఎస్‌ఆర్ పురంలో కరెన్సీ అలంకరణలో దుర్గమ్మ


సుజాతనగర్‌లో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ


గాజులు అలంకరణలో లక్ష్మీదేవి

పెందుర్తి: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా తొలి శుక్రవారం పెందుర్తి ప్రాంతంలో పలు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌ఆర్ పురంలో కొలువుదీరిన కనకదుర్గమ్మకు విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం ధనలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు, గ్రామ పెద్దలుఅమ్మవారిని దర్శించుకున్నారు.

- అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన కనకదుర్గమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు విష్ణు నంబూద్రి అమ్మవారికి నవ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశేషంగా లక్ష కుంకుమార్చన

సింహాచలం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజ విశేషంగా నిర్వహించారు. సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టింపజేసి లక్ష నామాలతో కుంకుమపూజ చేశారు. అష్టహారతి అందజేశారు.సాయంత్రం అమ్మవారికి ఆలయ బేడా మండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు.


అమ్మవార్లకు హారతి అందజేస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

లక్ష్మీదేవికి పూజలు

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ముస్తాబు చేసి ఆలయ ప్రాంగణంలో అధిష్టింపజేసి అర్చకుడు కె.కె. భార్గవ భక్తుల గోత్రనామాలతో అష్టోత్తరశత నామావళి పూజ చేశారు.

- అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలోని ఉమాదేవి సన్నిధిలో శ్రావణ శుక్రవారం పూజలు విశేషంగా జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు చేశారు.

ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వనాథం

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాథం ఫ్లోరోసిస్ నియంత్రణ,నివారణ గురించి అవగాహన కల్పించారు. రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఏ విధంగా వ్యాపిస్తుంది.. ఎలా నివారించవచ్చో వివరించారు. బోర్‌వెల్ వాటర్ ,పొగాకు సంబంధిత వస్తువుల ద్వారా బ్లాక్ సాల్ట్,బ్లాక్ టీ వంటి వాటిని మితిమీరి ఉపయోగిస్తే ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారని వివరించారు. పాఠశాలలో 3,4,5 తరగగతుల విద్యార్థులకు ఫ్లోరోసిస్ వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.అలాగే కమ్యూనిటీ సర్వే కూడా చేయాలన్నారు. రక్షిత తాగునీరు, విటమిన్ సి,విటమిన్ ఇ అధికంగా ఉన్న పదార్థాలు,కూరలు,పండ్లు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్,ఆరోగ్య పర్యవేక్షకులు నర్సింగరావు,ఆశ కార్యకర్త ఇందిర, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తరలింపు


అనుమతులు లేకుండా ప్రైవేటు భూమి నుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు


పోలీస్ స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన పొక్లెయిన్, ట్రాక్టర్లు

పొక్లెయిన్‌తో పాటు ఐదు ట్రాక్టర్ల సీజ్

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న యంత్రాలను మైనింగ్ అధికారులు సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు రెవెన్యూ,మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయా శాఖల అధికారులు పోలీస్‌లతో కలిసి మట్టి తవ్వుతున్న ప్రదేశాన్ని శుక్రవారం పరిశీలించారు. ప్రైవేటు స్థలంలో మట్టి తవ్వి అనుమతులు లేకుండా వేరే చోటకు తరలిస్తున్నట్లు గుర్తించారు. మట్టి తవ్వుతున్న పొక్లెయిన్‌తో పాటు తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ స్వాతి సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆయా వాహనాల యజమానులు తమ కార్యాలయానికి వస్తే అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి లేదా గ్రావెల్ తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఘనంగా నాగపంచమి పూజలు


నాగపంచమి పూజలు చేస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో మొదటి శ్రావణ శుక్రవారం, నాగపంచమి పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీయంత్ర మహామేరులోని ఈశాన్య దిక్కులో కొలువైన శ్రీమహాలక్ష్మి అమ్మవారి ప్రాంగణాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. అనంతరం క్షీరాభిషేకం,అష్టోత్తర శత నామావళి సహిత కుంకుమార్చన నిర్వహించారు. అలాగే నాగపంచమిని పురస్కరించుకొని హోమశాలలో శ్రీసుబ్రహ్మణ్య సహిత,శ్రీస్వర్ణ మహాలక్ష్మి,త్రి శతనామావళి హోమం నిర్వహించారు.మహిళలు పుట్టల వద్ద నాగదేవతకు మొక్కులు చెల్లించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

31న కౌన్సెలింగ్

మధురవాడ : బక్కన్నపాలెంలో గల ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి ఐటీఐ ట్రేడుల్లో పురుష దివ్యాంగ యువతను చేర్చుకునేందుకు మూడో దశ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 31న హాజరు కావాలని పీవో జె.మాధవి తెలిపారు. శిక్షణ కేంద్రంలో కార్పెంటర్ – 18, షీట్ మెటల్ వర్కర్ – 5, పెయింటర్ – 15 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కొమ్మాది: పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బావిలో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలివీ.. పూర్ణామార్కెట్‌కు చెందిన కాకర అప్పారావు (41) వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఊరు వెళ్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. శుక్రవారం ఓజోన్ వ్యాలీ రోడ్డు దరి ఓ బావిలో విగత జీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారంతో పీఎం పాలెం పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌకర్యాలు మెరుగుపర్చాలి


సబ్‌మెరైన్ మ్యూజియంను పరిశీలిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని, పాడైన వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బీచ్ రోడ్‌లో ఉన్న ఐఎన్ఎస్ కురుసుర సబ్‌మెరైన్, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియాన్ని సందర్శించారు. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియం పరిసరాలను పరిశీలించారు. వీఎంఆర్‌డీఏ సీఈ భవానీశంకర్ పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి అనగాని

విశాఖ సిటీ: జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయా జిల్లాలకు పతాకావిష్కరణ నిమిత్తం మంత్రులను నామినేట్ చేస్తూ రాష్ట్ర పరిపాలనా విభాగం శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖపట్నం జిల్లాకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నామినేట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంటూ జిల్లా కలెక్టర్ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించింది.